గురువారం ఢిల్లీలో జీహెచ్ఎంసీ తరఫున క్లీన్‌సిటీ అవార్డు అందుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, అదనపు కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ భరత్, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల

జీహెచ్ఎంసీకి క్లీన్ సిటీ అవార్డు

- మరో 3 మున్సిపాలిటీలకు సౌత్‌జోన్ క్లీనెస్ట్ అవార్డులు
- 18 మున్సిపాలిటీలకు పరిశుభ్రతలో బెస్ట్ ర్యాంకులు
- స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డుల ప్రదానం

హైదరాబాద్, జనవరి 11(నమస్తే తెలంగాణ): కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్, గార్బేజ్ ఫ్రీ సిటీ (జీఎఫ్‌సీ) స్టార్ రేటింగ్స్‌లో జీహెచ్ఎంసీకి క్లీన్ సిటీ అవార్డు దక్కింది. స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా లక్ష కన్నా ఎక్కువ జనాభా ఉన్న నగరాల క్యాటగిరీలో జీహెచ్ఎంసీకి జాతీయస్థాయిలో 9వ ర్యాంకు, 5 స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ లభించాయి. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పురి ముఖ్యఅతిథులుగా పాల్గొని పురస్కారాలను అందజేశారు. అలాగే, లక్ష కన్నా తక్కువ జనాభా ఉన్న జోనల్ అవార్డు క్యాటగిరీలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి సౌత్‌జోన్ క్లీనెస్ట్ సిటీ అవార్డు, 25,000-50,000 మధ్య జనాభా ఉన్న క్యాటగిరీలో నిజాంపేటకు సౌత్‌జోన్ క్లీనెస్ట్ సిటీ అవార్డు, 50,000-1,00,000 మధ్య జనాభా ఉన్న పట్టణాల్లో సిద్దిపేటకు సౌత్‌జోన్ క్లీనెస్ట్ సిటీ అవార్డు దక్కాయి. జోనల్ లెవల్ క్యాటగిరీలో 18 మున్సిపాలిటీలకు అత్యుత్తమ ర్యాంకులు వచ్చాయి. ర్యాంకులు సాధించినవాటిలో నిజాంపేట, మేడ్చల్, పీర్జాదిగూడ, నార్సింగి, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, దుబ్బాక, నాగారం, ఎల్లందు, తుర్కయంజాల్, బొల్లారం, హుజూరాబాద్, ఆర్మూర్, అమీన్‌పూర్, బోడుప్పల్, బండ్లగూడ జాగీర్ తదితర మున్సిపాలిటీలు ఉన్నాయి. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో పాటు వివిధ మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొని అవార్డులను అందుకున్నారు.

విషం తిన్న మూడో పులి ఎక్కడ?

- పులులు మృత్యువాతపై అటవీశాఖ సీరియస్
- అధికారుల అదుపులో ఆరుగురు
- పశు కళేబరంపై విషం చల్లిన అనుమానితులు
- మూడు పులులు తింటుండగా ఫోన్లలో చిత్రీకరణ

పులుల కోసం కాగజ్‌నగర్ అడవిలో గాలిస్తున్న అటవీ శాఖ అధికారులు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ)/మంచిర్యాల (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన రెండు పులుల మృతి ఘటనలో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. పశు కళేబరంపై విషంచల్లిన అనంతరం నిందితులు (అనుమానితులు) పులి రాకకోసం అక్కడే ఎదురుచూసినట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో వారు సెల్‌ఫోన్‌లో మూడు పులులు మాంసాన్ని తింటున్న వీడియోలను చిత్రీకరించినట్టు తెలిసింది. ఈ ఘటనలో రెండు పులులు మృత్యువాత పడగా, విషాహారాన్ని తిన్న మూడో పులి చనిపోయిందా? బతికే ఉన్నదా? అన్న మిస్టరీని ఛేదించాల్సి ఉన్నది. కుమ్రంభీం జిల్లా కాగజ్‌నగర్ అటవీ కారిడార్‌లో పులుల మృతి ఘటనను అటవీశాఖ సీరియస్‌గా తీసుకున్నది. విషప్రయోగం చేసినవారిగా అనుమానిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేయగా, అసలు విషయాలు వెలుగుచూశాయని ప్రచారం జరుగుతున్నది. బుధవారం అర్ధరాత్రి ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని వాంకిడి మండలం సర్కేపల్లి గ్రామానికి చెందిన నలుగురిని, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని దరిగాం గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా సర్కేపల్లికి చెందిన నలుగురిలో ఇద్దరు విషప్రయోగం చేసినట్టు తెలిసింది. ఆ ఇద్దరు అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు మైనర్లను తమ వెంట తీసుకెళ్లినట్టు సమాచారం. వారితోపాటు దరిగాం గ్రామానికి చెందిన మరో ఇద్దరు సైతం వారికి సహకరించినట్టు తెలుస్తున్నది. గురువారం ఉదయం ఆ ఆరుగురిని విషప్రయోగం చేసిన పశు కళేబరం ఉంచిన ప్రాంతానికి, పులులు మృతిచెందిన ప్రాంతాలకు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అధికారులు తీసుకువెళ్లారు.

కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన

కాగజ్‌నగర్, జనవరి 11: దరిగాం గ్రామ అటవీ ప్రాంతంలో రెండు పులుల మృతి ఘటనపై అటవీశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. షర్కపల్లి, రింగరేట్, దరిగాం గ్రామాలకు చెందిన ఆరుగురు అనుమానితులను బుధవారం అదుపులోకి తీసుకొని కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వారి కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. తమ పిల్లలను కలువనివ్వడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో వెనక్కి తగ్గిన అధికారులు తమ అదుపులో ఉన్నవారిని కలిసేందుకు అనుమతించారు. వారిలో ఇద్దరు మైనర్ బాలురను బయటకు పంపారు. వారు మీడియాతో మాట్లాడుతూ తమను ఇష్టారాజ్యంగా కొట్టారని, దీంతో భయపడి వేలిముద్రలు వేశామని తెలిపారు. అదుపులో ఉన్నవారందరినీ బట్టలు విప్పి కొట్టారంటూ మైనర్ బాలుడొకరు చెప్పారు.

మూడు పులులు సురక్షితమేనా?

మొత్తం ఆరు పులుల్లో రెండు చనిపోగా, మిగిలిన నాలుగింటిలో మూడింటి పాదముద్రలను అధికారులు గురువారం గుర్తించారు. తండ్రి పులి(ఎస్-9)తో తిరిగే రెండు కూనల్లో ఎస్-15 చనిపోగా, రెండోది చాలారోజుల క్రితమే విడిపోయి వేరుగా సంచరిస్తున్నట్టు చెప్తున్నారు. కానీ విషప్రయోగం చేసిన పశుమాంసాన్ని మూడు పులులు తిన్నట్టు తెలుస్తున్నది. ఆ మూడింటిలో ఒకటి ఎస్-9, రెండోది ఎస్-15 చనిపోగా, మూడోది ఏమైందన్నది తేలాల్సి ఉన్నది. విషప్రయోగం చేసిన మాంసం తిన్నది ఇంకా ఆచూకీ తెలియని పులేనా? లేక తల్లితో ఉన్నట్టు చెప్తున్న రెండు పులుల్లో ఒకటా, లేదా చాలారోజుల క్రితం వేరుగా విడిపోయి సంచరిస్తున్న పులినా అన్నది తేలాల్సి ఉన్నది.

నాలుగు పులుల జాడ కోసం జల్లెడ

విషప్రయోగంలో మృతి చెందిన ఎస్-9 (మగపులి)తోపాటు ఎస్-6 ఆడపులి, వాటి పిల్లలైన నాలుగు పిల్లలు కాగజ్‌నగర్ డివిజన్‌లోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నాయి. వీటిలో ఎస్-9 మగపులి, దానితోనే కలిసి తిరిగే పులిపిల్ల ఎస్-15 చనిపోయాయి. ఆడపులి అయిన ఎస్-6, దాని పిల్లలైన మరో మూడు పులుల జాడ కోసం అడవి మొత్తం జల్లెడ పడుతున్నారు. బుధవారం 70 మంది 15 బృందాలుగా విడిపోయి పులులను ట్రాక్ చేశారు. గురువారం మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్ డివిజన్ల నుంచి వచ్చిన 120 మంది 13 బృందాలుగా విడిపోయి అడవి మొత్తం జల్లెడపట్టారు. సర్కేపల్లి గ్రామం చుట్టూ విస్తరించి ఉన్న గుట్టలను ఈ బృందాలు ముమ్మరంగా గాలించాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్-6 (ఆడ పులి)తోపాటు దాని రెండు పిల్లల పాదముద్రలను వారు గుర్తించారు. రెండు పులులు మృతిచెందిన ప్రాంతానికి పక్కనే ఉన్న ఊట్‌పల్లి గ్రామంలో ఓ లేగ దూడను పులులు వేటాడినట్టు కూడా తెలిసింది.

గురువారం బయ్యారంలో గొడవ పడుతున్న ఇరు వర్గాల కాంగ్రెస్ కార్యకర్తలు

వీధికెక్కిన కాంగ్రెస్ వర్గపోరు

బయ్యారం పార్టీ ఆఫీస్ వేదికగా రచ్చ

బయ్యారం, జనవరి 11: మహబూబాబాద్ జిల్లా బయ్యారం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బహిర్గతమైంది. పార్టీ కార్యాలయం వేదికగా గురువారం రెండు వర్గాలు చేసిన రచ్చ వీధికెక్కింది. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ముసలయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మరో వర్గానికి చెందిన నాయకులు సమావేశం వద్దకు వచ్చి తాము కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలమేనని, తమకెందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పార్టీకి సంబంధం లేని కొందరు వ్యక్తులు పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. మరో వర్గం నాయకులు సైతం పార్టీ కోసం తాము కష్టపడ్డామని ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో కుర్చీలు.. బల్లలు మీదకు ఎత్తి గంటపాటు కార్యాలయంలో రచ్చరచ్చ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాల నాయకులను సముదాయించారు.

విద్యార్థిని ఆత్మహత్యపై ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్సీ) రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 5న కాలేజీకి వచ్చిన ఆ విద్యార్థిని ఐదో అంతస్థుపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. పత్రికల్లో వచ్చిన ఈ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా స్వీకరించింది. కూకట్‌పల్లికి చెందిన ఆ విద్యార్థిని మూడు నెలల క్రితమే కాలేజీలో చేరిందని, రోజూ బస్సులో ప్రయాణిస్తుందని వార్తా కథనాలు పేర్కొన్నాయి. విద్యార్థిని మృతిపై పత్రికల్లో వచ్చిన కథనాలు నిజమే అయితే అది తీవ్ర ఆందోళనకరమైన అంశమని, మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ఎన్‌హెచ్‌ఆర్సీ పేర్కొంది. ఆ ఘటనపై నాలుగువారాల్లోగా తమకు నివేదిక అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డీజీపీకి ఇచ్చిన నోటీసుల్లో ఆదేశించింది. ఆత్మహత్య ఘటనపై పోలీసుల దర్యాప్తు, కాలేజీ యాజమాన్యం జరిపిన విచారణలో వెల్లడైన అంశాలను ఆ నివేదికలో పేర్కొనాలని సూచించింది.

• సీట్ల కోసం సిగపట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి.. సరిపడా బస్సులు నడపకపోవడంతో రోజూ ఏదో ఓ చోట సమస్యలు తలెత్తుతున్నాయి. బస్సుల్లో సీట్ల కోసం మహిళలు సిగపట్లు పట్టుకుంటున్నారు. గురువారం నిర్మల్ జిల్లా ముథోల్ బస్టాండ్‌లో బస్సులో సీట్ల కోసం మహిళలు జుట్టుపట్టి కొట్టుకున్న ఉదంతమే అందుకు నిదర్శనం. కండక్టర్, ప్రయాణికులు ఎంత వారించినా వినకుండా పిడిగుద్దులు గుప్పించుకున్నారు. -ముథోల్

తొమ్మిదిమంది ఉపాధ్యాయుల సస్పెన్షన్

వనపర్తి, జనవరి 11 : వనపర్తి జిల్లా పెద్దమందడి జడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిది మంది ఉపాధ్యాయులను కలెక్టర్ సస్పెండ్ చేశారు. గురువారం కలెక్టర్ పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంలో 9మంది ఉపాధ్యాయులు గైర్హాజర్ కావడంతో హెచ్ఎం మంజులతను ప్రశ్నించారు. ఎడ్యుకేషన్ ట్రిప్‌కు వెళ్లారని పేర్కొనడంతో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విద్యార్థులను ట్రిప్‌కు తీసుకెళ్లడంపై కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ వారిని సస్పెండ్ చేశారు.

లంచాల పేరుతో పీడిస్తే కఠిన చర్యలు

- అధికారులకు ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): లంచాల పేరుతో ప్రజలను పీడిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ అధికారులను హెచ్చరించారు. పేదలను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టడనేది పనికిమాలిన చర్య అని గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇటీవల నారాయణగూడకు చెందిన ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వాహనదారుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కథనాన్ని 'హైదరాబాద్ వైబ్' అనే నెటిజన్ సీవీ ఆనంద్‌కు ట్యాగ్‌చేశారు. అన్నిశాఖల అధికారులు డబ్బుల కోసం సామాన్యులను వేధిస్తున్నారని, లంచాలతో ప్రజలు విసిగి వేసారిపోతున్నారని ఆయన పేర్కొన్నారు.

23న సికింద్రాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఈ నెల 23న సికింద్రాబాద్ నుంచి 'జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర' పేరుతో భారత్ గౌరవ్ యాత్ర రైలు ప్రారంభం కానున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఆ రైలు నడుస్తుందని పేర్కొన్నారు. అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరును కలుపుతూ ఈ యాత్ర సాగుతుందని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలోని సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, ఏపీలోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరుతో పాటు రేణిగుంట స్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కి దిగే సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 31 వరకు యాత్ర కొనసాగుతుందన్నారు.

'సూపర్ ఖడ్గం' నకిలీ పురుగు మందు

హైదరాబాద్, జనవరి 11(నమస్తే తెలంగాణ): ట్రైకామ్ ఆగ్రో సంస్థ ఉత్పత్తి చేస్తున్న సూపర్ ఖడ్గం(లాంబ్డా సైహలోథ్రిన్) పురుగుల మందు నకిలీదని వ్యవసాయ శాఖ తేల్చింది. దీంతో ఈ పరుగుల మందును రైతులెవరూ వినియోగించొద్దని, వ్యాపారులు విక్రయించొద్దని సూచించింది.

ఏసీబీకి చిక్కిన జనగామ డీఎంహెచ్‌వో

- ఔట్‌సోర్సింగ్ మహిళా ఫార్మసిస్ట్ నుంచి రూ.లక్ష డిమాండ్
- 50 వేలు లంచం తీసుకుంటూ దొరికిన జూనియర్ అసిస్టెంట్
- నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

ఏసీబీకి చిక్కిన జనగామ డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్

జనగామ చౌరస్తా, జనవరి 11: జనగామ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శేపూరి ప్రశాంత్ గురువారం ఏసీబీకి చిక్కారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఎండీ అజార్ ద్వారా ఔట్‌సోర్సింగ్ మహిళా ఫార్మసిస్ట్ నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మీడియాకు వివరాలు వెల్లడించారు. కాముని స్రవంతి జనగామ మండలంలోని ఓబుల్ కేశవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్ట్‌గా మూడేండ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నది. 2023 అక్టోబర్‌లో రెగ్యులర్ ఫార్మాసిస్టు విధుల్లో చేరగా.. స్రవంతిని రఘునాథపల్లి పీహెచ్‌సీకి మార్చారు. అక్కడ వారం రోజులపాటు పనిచేసిన స్రవంతిని ఉన్నఫళంగా విధుల నుంచి తొలగించారు. తనను ఉద్యోగం నుంచి తొలగించొద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంత్‌ను వేడుకున్నది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగంలో కొనసాగాలన్నా, 2 నెలల వేతనం చెల్లించాలన్నా రూ.లక్ష లంచం ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ అజార్ ద్వారా డీఎంహెచ్‌వో డిమాండ్ చేశారు. చేసేదిలేక స్రవంతి వరంగల్ ఏసీబీ అధికారులను సంప్రదించింది. వారి ప్లాన్ ప్రకారం.. వారం కిందట రూ.50 వేలు ఇచ్చిన స్రవంతి.. తాజాగా రూ.50 వేల నగదును డీఎంహెచ్‌వో ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ అజార్ ముందే స్రవంతి డీఎంహెచ్‌వో చాంబర్‌లోని టేబుల్ డ్రాలో పెడుతున్న క్రమంలో ఏసీబీ అధికారులు ఇద్దరినీ పట్టుకున్నారు. నిందితులను శుక్రవారం హైదరాబాద్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వివరించారు.

రైల్వే కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

- రైల్వే, రోడ్ సేఫ్టీ ఏడీజీ మహేశ్ భగవత్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): రైల్వేస్టేషన్లలో నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు రైల్వే, రోడ్ సేఫ్టీ ఏడీజీ మహేశ్ భగవత్ వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ కోసం ఓ వ్యక్తిని హతమార్చిన నిందితుడు మహమ్మద్ సొహైల్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. అతని కుడి చేతిపై 'అమ్మ' అనే పచ్చబొట్టు ఉన్న ఫొటోలతో పాటు ఇతర ఫొటోలను ఏడీజీ విడుదల చేశారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న చిన్నయ్యను తనిఖీ చేయగా అతని వద్ద 15 గ్రాముల బంగారు గొలుసు దొరికిందని తెలిపారు. అదుపులోకి తీసుకొని విచారించగా చైన్‌స్నాచర్ అని తేలిందని చెప్పారు. విచారణలో 5 చైన్‌స్నాచింగ్ నేరాలు చేసినట్టు నిందితుడు చిన్నయ్య ఒప్పుకున్నట్టు తెలిపారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

- డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలి
- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

మోటకొండూర్, జనవరి 11: స్వచ్ఛ భారత్‌కు అసలు రూపమైన పారిశుధ్య కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు నెల నెలా పెన్షన్ ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఫిబ్రవరి 29న చేపట్టనున్న చలో హైదరాబాద్ పోరుగర్జన కరపత్రాలను గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు.

శ్రీశైలంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఏపీలోని శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఈ నెల 18 వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ప్రతిరోజూ రాత్రివేళల్లో స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆర్జిత హోమాలు నిలుపుదల చేసినట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 13 నుంచి జనవరి 9 వరకు రూ.4,38,53,238 కోట్ల మేరకు ఆలయ హుండీ ఆదాయం సమకూరిందని తెలిపారు. నగదుతోపాటు 133.3 గ్రాముల బంగారం, 11 కిలోల 850 గ్రాముల వెండి కానుకలుగా వచ్చినట్టు పేర్కొన్నారు.

కాళేశ్వరంపై ముగిసిన విజిలెన్స్ తనిఖీలు

- మూడు రోజులపాటు 'మహదేవపూర్'లో విచారణ
- పూర్తిస్థాయి విచారణ తర్వాత ప్రభుత్వానికి నివేదిక

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 11 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూడు రోజులుగా నిర్వహించిన విచారణ గురువారంతో ముగిసింది. మహదేవపూర్ డివిజన్ కార్యాలయంలో మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విజిలెన్స్ ఎస్పీ రమేశ్, హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంజినీరింగ్ అధికారులు.. విచారణ మధ్యలో ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావుతో కలిసి ప్రత్యేకంగా మేడిగడ్డ బరాజ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. డీపీఆర్ అండ్ సీడబ్ల్యూసీ క్లియరెన్స్, పంప్‌హౌస్, బరాజ్‌ల డ్రాయింగ్, డిజైన్, ఇన్వెస్టిగేషన్ అండ్ సర్వే వివరాలు (తేదీల వారీగా), పంప్‌హౌస్ అండ్ బరాజ్‌ల ఫౌండేషన్ ఎక్స్‌ప్లోరేషన్, సీఈ, సీడీవో అప్రూవల్ డిజైన్ అండ్ డ్రాయింగ్, ఎస్టిమేట్ అండ్ అప్రూవల్, అగ్రిమెంట్ కాపీ, మేడిగడ్డ నేషనల్ డ్యాం సేఫ్టీ రిపోర్టు తదితర 46 అంశాలపై తనిఖీలు కొనసాగించారు. పలు రికార్డులను తమ వెంట హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నామని, విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ఎస్పీ రమేశ్ చెప్పారు.

ఫిబ్రవరి 26 నుంచి బయో ఏషియా సదస్సు

- 50 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధుల హాజరు
- ఏర్పాట్లపై ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు సమీక్ష

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఏటా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే హెల్త్ కేర్ అండ్ లైఫ్ సైన్సెస్ బయోఏషియా సదస్సు నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించే 21వ సదస్సులో 50 దేశాల నుంచి పరిశ్రమలు, ప్రభుత్వాలకు చెందిన ప్రముఖులు, శాస్త్రవేత్తలు, రెగ్యులేటరీ బాడీ ప్రతినిధులు, విద్యావేత్తలు, పరిశోధకులు, వ్యవస్థాపకులు తదితర 3,000 మందికిపైగా పాల్గొననున్నారు. ఇందులో వివిధ కంపెనీలకు చెందిన గ్లోబల్ సీఈవోలు, ఇండస్ట్రీ లీడర్లు సహా దాదాపు 70 మంది ప్రసంగాలు ఉంటాయి. డాటా, ఏఐ-రీడిజైనింగ్ పాసిబులిటీస్ థీమ్‌పై ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సదస్సు ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎలి లిల్లీ అండ్ కంపెనీ సీఈవో డేవిడ్ రిక్స్, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ ఇన్‌కమింగ్ సీఈవో డాక్టర్ క్రిస్టోఫర్ బోర్నర్, మెడ్‌ట్రానిక్ చైర్మన్, సీఈవో జియోఫ్ మార్తా, నోబెల్ బహుమతి గ్రహీత, జాన్స్ హాప్కిన్స్ మెడిసిన్ స్కూల్ ప్రొఫెసర్ గ్రెగ్ సెమెంజా, ఒలింపస్ సీఈవో, ప్రెసిడెంట్ స్టెఫాన్ కౌఫ్‌మాన్, ప్రావిడెన్స్ సీఈవో డాక్టర్ రాడ్‌హోచ్మాన్, అడ్వెంట్ ఇంటర్నేషనల్ గ్లోబల్ ఆపరేటింగ్ పార్ట్‌నర్ స్టీఫెన్ స్టోఫెల్ తదితరులు సదస్సులో ముఖ్య వక్తలుగా ప్రసంగించనున్నారు. సుమారు 200 కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి.

లైఫ్‌సైన్సెస్ అభివృద్ధికి దోహదం: శ్రీధర్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే బయో ఏషియా సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించటంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా దేశీయ, ప్రపంచ లైఫ్‌సైన్సెస్, దాని అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతున్నదని తెలిపారు. ఈసారి సదస్సుకు అనేక మంది సీఈవోలు మొదటిసారి హాజరవుతున్నారని వెల్లడించారు. సదస్సును ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు.

ఐపీఎస్ బదిలీల్లో వివక్ష!

- బాధ్యతలు ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి
- నేటికీ బాధ్యతలు చేపట్టనివారికి మళ్లీ బదిలీ?
- త్వరలోనే మళ్లీ బదిలీలు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో వివక్ష, రాజకీయ జోక్యం పెరుగుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన బదిలీల్లో క్లీన్‌చిట్ ఉన్నవారికి వారి సామర్థ్యం మేరకు పోస్టింగ్‌లు ఇచ్చారనే అభిప్రాయం తొలుత వ్యక్తమైనా, క్రమంగా పరిస్థితి మారుతున్నది. ఇటీవల 23 మంది ఐపీఎస్‌లను బదిలీ చేయగా, రాజకీయ నాయకులు జోక్యంతో పలువురు అధికారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అంటున్నారు. కొందరి ట్రాక్ రికార్డుపై ఆయా జిల్లాల రాజకీయ నాయకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. వారిని బాధ్యతలు చేపట్టవద్దని మౌఖికంగా ఆదేశించినట్టు సమాచారం. దీంతో మళ్లీ ఐపీఎస్‌ల బదిలీలు తప్పవనే ప్రచారం ఊపందుకున్నది. ఐపీఎస్‌ల పోస్టింగ్‌ల విషయంలో ఏ అభ్యంతరాలకూ తావు లేకుండా కచ్చితంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నదని పైకి చెప్తున్నప్పటికీ, రాజకీయ రంగు పులుముకోవడంతోనే కొందరి బదిలీలు జరుగుతున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఐపీఎస్‌లు తాము వెయిటింగ్‌కు వెళ్లాల్సి వస్తుందని భయపడుతున్నారు. త్వరలో జరుగబోయే ఐపీఎస్‌ల బదిలీల్లో ప్రస్తుతం బాధ్యతలు చేపట్టకుండా ఉన్న వారి జాబితాను కూడా చేర్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. కోరుకున్న చోట పోస్టింగ్ కోసం కొందరు ఐపీఎస్‌లు శక్తిమేరకు లాబీయింగ్ చేస్తున్నట్టు సమాచారం. ఐపీఎస్‌ల బదిలీల్లో రాజకీయ ప్రమేయం మంచిది కాదనే అభిప్రాయాన్ని సీనియర్ అధికారులు వ్యక్తంచేస్తున్నారు.

తిరుమల ఏప్రిల్ దర్శనం టికెట్ల షెడ్యూల్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఏప్రిల్ నెలలో తిరుమల శ్రీవారి దర్శనానికి ఆన్‌లైన్ టికెట్ల కోటా షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గురువారం విడుదల చేసింది. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి 20న ఉదయం 10 గంటల వరకు సుప్రభాతం, తోమాల తదితర ఆర్జిత సేవల లక్కీడిప్ కోసం నమోదుకు అవకాశం కల్పించింది. 22న మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టికెట్లు, 11 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శనం టికెట్లను విడుదల చేస్తారు. 24న ఉదయం 10 గంటలకు రూ.300 దర్శనం టికెట్లను విడుదల చేస్తారు.

ఆధునీకరించిన టీటీడీ వెబ్‌సైట్ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయాల సమాచారంతో ఆధునీకరించిన వైబ్‌సైట్ ttdevasthanamas.ap.gov.in ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రారంభించారు. టీటీడీలో 60కి పైగా ఉన్న స్థానిక, అనుబంధ ఆలయాలకు సంబంధించిన స్థలపురాణం, ఆర్జితసేవలు, దర్శన వేళలు, రవాణా వివరాలు, ఇతర సౌకర్యాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆలయ విశిష్టతపై ఫొటోలు, వీడియోలను కూడా అందుబాటులో ఉంచారు.

'22న సెలవు ప్రకటించండి'

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ జరిగే 22న సెలవుదినంగా ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రతి గ్రామంలో ఆ రోజున పండుగ వాతావరణం ఉంటుంది కాబట్టి సెలవు ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు కే హనుమంత రావు, ప్రధాన కార్యదర్శి నవత్ సురేశ్ కోరారు. గత ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షల మూల్యాంకన పారితోషికాన్ని ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కృష్ణారావును కోరినట్టు తెలిపారు.